# 'చిరుదివ్వెల వెలుగులు'

## సుస్మితా రమణామూర్తి

"నమస్కారం సార్! పరిచితులైన కంఠం విని వెనుతిరిగి చూశాడు గోపాల్

ఇరవయ్యేళ్ళ కుర్రాడు నవ్వుతూ కన్పించాడు.

బాగా తెలిసిన ముఖం. ఫలానా అని నిర్ధారించుకోలేకపోతున్నాడు తను. మాటల్లోకి దిగితే గుర్తుకి రావొచ్చన్న తలంపుతో – "ఏఁవిటోయ్, బాగున్నావా? అమ్మ నాన్న కులాశాయేనా?", కుశల ప్రశ్నలు వేశాడు.

"అంతా బాగున్నారండి? నాన్నగారు మిమ్మల్ని కలియమన్నారండి! సాయంత్రం ఇంటికి వద్దామనుకుంటుంటే అనుకోకుండా మీరు కన్పించారండి!" వినయంగా చెప్పాడు కుర్రాడు.

"ఏదైనా సలహా గురించా? ఇంతకీ నీవేం జేస్తున్నావ్? చదువుకుంటున్నావా? లేక ... ఏదైనా ఉద్యోగ ప్రయత్నంలో వున్నావా?"

"ఈ ఊర్లోనే ఎస్. ఎస్. సి పాసయాను కదండీ? ...."

"అవునవును! ఎస్ ఎస్ సి. పాసై ఎన్నాళ్ళయింది?" కుర్రాడి మాటలకు అడ్డు తగులుతూ అడిగాడు గోపాల్.

"అప్పుడే మర్చిపోయార్గా సార్ నన్ను!? మీ దగ్గర ప్రయివేటు చదివిన పదిమంది ఫస్ట్ క్లాసులో పాసైన సంవత్సరం గుర్తులేదాండి మీకు!? పోనీ మీ జేబులో వున్న పెన్‌ని చూసైనా నేనెవరో గుర్తొస్తుందేఁవో ప్రయత్నించండి సార్!" "గోపాల్ జేబు వేపు చూస్తూ అన్నాడు కుర్రాడు.

ఈ కాలపు కుర్రాళ్ళు బాగా తెలివైనవాళ్ళు సుమా! ఏదో కప్పదాటు వేద్దామనుకున్నాను గాని – ఇలాదొరికిపోతాననుకోలేదు పెన్ చూసైనా గుర్తు తెచ్చుకోమంటున్నాడే!? ... ఎవరు చెప్మా? ...



రెండేళ్ళ క్రితం తన దగ్గర ప్రయివేటు చదువుకున్న కుర్రాడొకడు బహుమతిగా ఈ పెన్నిచ్చాడు. ఆ కుర్రాడు – ఈ కుర్రాడేనా? అయ్యుండొచ్చు! లేకుంటే అంత ఖచ్చితంగా ఎలా చెబుతాడు? ....

గోపాల్ ఆలోచనలు ఓ కొలిక్కి రాలేదు.

"సారి సార్! మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను. ఎంతోమంది మీ దగ్గరకు ప్రయివేటుకి వస్తుంటారు. అంతమందినీ పేరు పేరునా గుర్తు పెట్టుకోవడం కష్టమే! నేను వీర్రాజునండి? ఆ రోజుల్లో మీ ఇంటికి దగ్గర్లో వున్న మా చుట్టాల ఇంట్లో వుండి చదువుకునేవాణ్ని". అంటూ చెప్పాడు తను.

అప్పటికి వీర్రాజు విషయాలు గుర్తొచ్చాయ్ గోపాల్‌కి.

"మీ నాన్నగారు వ్యవసాయం చేస్తుంటారు కదూ? అనకాపల్లేనా మీది? ఇంటర్ మీ వూర్లోనే చేశావు కదూ?" అంటూ అడిగాడు.

వీర్రాజు కళ్ళు ఆనందంతో మెరిశాయ్.

"మీ జ్ఞాపకశక్తికి జోహార్సార్!" అన్నాడు వీర్రాజు.

"నీవన్నట్లు అంతమందినీ గుర్తు పెట్టుకోవటం కష్టమే అయినా అందర్నీ మర్చిపోవడం కూడా అంతే కష్టం! ఏమంటావ్?" నవ్వుతూ అడిగాడు గోపాల్.

"అవున్సార్!"

"ఇప్పుడేం జేస్తున్నావ్?"

"ఇంటరైంది. ఏదైనా డిగ్రీ చేద్దామనుకుంటున్నానండి!"

"వెరి గుడ్!"

"నాన్నగారు వద్దంటున్నారండి!"

"ఎందుకని!? ...."

ఎస్. ఎస్. సి. పాసైన వెంటనే నాన్నగారి బలవంతంవల్ల ఎంప్లాయ్‌మెంట్లో రిజిస్ట్రేషన్ వేయించాను. ఈ మధ్య అటెండర్ పోస్టుకి ఇంటర్వ్యూ రావడం సెలెక్టవడం కూడా జరిగింది. ఈ నెలాఖర్లోగా చేరాలని ఆర్డర్స్ కూడా వచ్చేశాయ్. ఈ ఊర్లోనే చదువుకుని – ఇంటర్ పాసై ఉండికూడా ఈ ఊర్లోనే అటెండర్‌గా ఉద్యోగం చేయడమంటె అదోలా వుంది నాకు. ఉద్యోగంలో చేరడమా లేక చదువుకోడమా?– అన్న విషయంలో మీ సలహా తీసుకోమని నాన్నగారు చెప్పారు నాకు."

"అలాగా!" అంటూ ఆలోచనల్లో పడ్డాడు గోపాల్.

"డిగ్రీ చదివితే ఆఫీసర్ ఉద్యోగం రావచ్చు కదండి?" వీర్రాజు.

"రానూ వచ్చు. రాకపోనూ వచ్చు. ఉద్యోగం సంగతి తర్వాత ఆలోచిద్దాం గాని అసలు చదువుకోడం ఎందుకో చెప్పు."

"అదేమిట్సార్!? ... ఎంత ఎక్కువ చదువుకుంటే అంత మంచి ఉద్యోగం వస్తుంది కదా? మీకు రెండు డిగ్రీలుండబట్టే కదా మీకు పెద్ద ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది?"

"చూడు రాజూ! చదువు యొక్క పరమార్థం ఉద్యోగంకాదు. చదువు జ్ఞానసముపార్జన కోసమని అంతా తెల్సుకున్ననాడు గాని ప్రస్తుతం వున్న నిరుద్యోగ సమస్య అధికారంలో చిరుదివ్వెల వెలుగులు ప్రసరింపబడవు. వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకుని భవిష్యత్తులో అవకాశం రానప్పుడు బాధపడి లాభం వుండదు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ విలువ గుర్తించిన ఎంతోమంది డిగ్రీదారులు నిరుద్యోగ సమస్యవల్ల కిళ్ళీ షాపులు–ఫాన్సీ షాపులు పెట్టుకుని బ్రతకడానికి ప్రయత్నిస్తున్న రోజులివి......"

"ఎక్కువ చదువుకోవడం మంచిది కాదంటారా!? ..." గోపాల్ మాటలకి అడ్డు తగులుతూ అమాయకంగా అడిగాడు వీర్రాజు.

"ఇప్పట్లో నీకే కాదు. నీ పరిస్థితిలో వున్న ఎవరికీ నా మాటలు అర్థంకావు. ఒక్క విషయం మాత్రం నీకు అర్థమయ్యేలా చెప్పగలను. నీ తల్లిదండ్రులు తల తాకట్టుపెట్టయినా నిన్ను పెద్ద చదువులు చదివిస్తే చదివించొచ్చు గాని రాబోయే ఓ రేపులో నీ చదువుకి తగ్గ ఉద్యోగాన్ని రికమండేషన్ ద్వారా గాని డబ్బు మూలంగా గాని సంపాదించి పెట్టలేరు. నాకంటే నీకే మీ ఇంటి పరిస్థితులు బాగా తెలియాలి."

"బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే ఉద్యోగం ఎందుకు రాదండి?"

బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే 'ఉద్యోగం రాదు' అని ఖచ్చితంగా నే చెప్పలేను గాని బాగా చదువుకుంటే నీ బుర్ర బాగా పదునెక్కుతుంది. తెలివితేటలు పెరుగుతాయ్. తద్వారా దేశంలోని పరిస్థితుల్ని అన్ని కోణాల నుంచి పరిశీలించి అర్థం చేసుకోగలవు. చదువు కేవలం ఉద్యోగం కోసం కాదన్న విషయం అప్పటిగ్గాని నీకర్థంకాదు".

"ఆ విషయం అర్థంచేసుకోడానికైనా చదువుకోవాలి కదండి?"

వీర్రాజు వేపు చురుగ్గా చూశాడు గోపాల్.

అమాయకత్వంతో నిండిన తన ముఖాన్ని చూసి – "చదువుకోవచ్చు. ఉద్యోగం చేస్తూ కూడా చదువుకోవచ్చు." చెప్పాడు గోపాల్. వీర్రాజుకి గోపాల్ మాటలు రుచింపలేదు.

"నా మాటలు ఇప్పటికీ నీకు అర్థం కాలేదు కదూ? ప్రత్యక్షంగా చూస్తే నీకే తెలుస్తుంది పద!" అంటూ గోపాల్ వీర్రాజుని దగ్గర్లో వున్న కలెక్టర్ ఆఫీసుకి తీసుకువెళ్ళాడు.


"ఆ వరండాలో ఒక్కో స్తంభానికి చేరబడి కూర్చున్న మనుషుల్ని వాళ్ళ చుట్టూ వున్న గుంపుల్ని ఎప్పుడైనా చూశావా?" గోపాల్ ప్రశ్న

"ఓసారెప్పుడో బేంకు పనిమీద వచ్చినప్పుడు చూశాన్సార్!"

"ఆ మనుషుల గురించి నీకేం తెల్సో చెప్పు!"

"ఇక్కడున్న బేంకుకి – కలెక్టరాఫీసుకి సంబంధించిన అప్లికేషన్లు రాయించుకోడానికి ఛెలానులు నింపించుకోడానికి – టైపింగ్ కోసం ఆ స్తంభానికి ఆనుకుని కూర్చున్న మనుష్యుల దగ్గరకు వెళ్తుంటారు. తమ పని చేయించుకుని అర్థో, రూపాయో వాళ్ళకిస్తుంటారు. అంతేనా సార్?"

"ఫర్వాలేదు. విషయాన్ని బాగానే ఆకళింపు జేసుకున్నావ్. ప్రక్కనే పోస్టాఫీసు వుంది కదా? కావాల్సిన వాళ్ళకు ఉత్తరాలు రాసిపెడ్తారు. కొంతమందికి వచ్చిన ఉత్తరాల్ని విన్పిస్తారు. మనియార్డర్ ఫారాన్ని నింపి పెడ్తారు. ఇలా అన్ని విధాల అందరికీ కావాల్సిన పనుల్ని కూర్చున్న చోట్నించి లేవకుండానే ఎంతో ఓపిగ్గా చేసిపెడ్తూ ఉదయం నుంచి సాయంత్రం దాకా కూడబెట్టిన పావలాల్ని – అర్ధల్ని పదులు – పాతికలుగా మార్చుకుంటారు. ప్రతివాడికీ ఏ రోజూ పాతిక






రూపాయలకి తక్కువ వుండదు ఆదాయం!"

గోపాల్ చెప్పింది శ్రద్ధగా విన్న వీర్రాజు తేలిగ్గా నవ్వేస్తూ – పదో క్లాసో-ఇంటరో చెట్టేక్కేసిన వాళ్ళై వుంటారు వాళ్ళు. ఉద్యోగం దొరక్క ఇలా బ్రతికేస్తున్నారనుకుంటాను?" అన్నాడు.

"అలాంటివాళ్ళూ వున్నారు. డిగ్రీ చదువులు వెలగబెట్టి ఉద్యోగం రాక ఎప్పుడు వస్తుందో తెలియని ఉద్యోగం కోసం పడిగాపులు కాస్తూ కాలాన్ని వృధా చేయకుండా – తనపై ఆధారపడిన వాళ్ళను ఆదుకోడానికి స్వంత తెలివి తేటలతో అందరి అభిమానాన్ని చూరగొంటూ అలా బ్రతుకు శకటాన్ని గుట్టుగా ఈడ్చేస్తున్న వాళ్ళూ వున్నారు."

"అదే(విట్సార్!? ... పెద్ద చదువు చదువు

# చిరుదివ్వెల వెలుగులు

కున్నోళ్ళవి కూడా కేరాఫ్ వరండా బ్రతుకులై పోయాయంటే నమ్మశక్యంగా లేదండి? ...."

"నా మాటలు నీకు ఆశ్చర్యంగానే వుండొచ్చు. పెద్ద చదువు – పెద్ద ఉద్యోగం, చిన్న చదువు – చిన్న ఉద్యోగం – అన్న కొలబద్ద నీ బుర్రలోంచి పోయినప్పుడుగాని నా మాటలు నీకు అర్థంకావు. స్సరే! వాళ్ళు కాస్త ఖాళీగా వున్నప్పుడు వాళ్ళేం చదువుకున్నారో? వాళ్ళ పరిస్థితులే(విటో? – నీవంతట నీవే వాళ్ళ ద్వారా తెల్సుకుని సాయంత్రం మా ఇంటికి రా? నాకు అర్జంటు పనొటుంది. నే వెళ్ళాలి! సాయంత్రం తప్పకుండా రావాలి సుమా!" అంటూ గోపాల్ వీర్రాజుని అక్కడ వదిలేసి వెళ్ళిపోయాడు.

* * * * *

నమస్కారం సార్!"

"రావోయ్, రా! నీ గురించే ఎదురు చూస్తున్నాను. మీరు లెక్కలు చేస్తుండండి: ఇప్పుడే వస్తాను." అంటూ ప్రయివేటు కుర్రాళ్ళకి చెప్పి వీర్రాజుతో ప్రక్క గదిలోకి వెళ్ళాడు గోపాల్.

"మీరు చెప్పిందే రైట్సార్! అక్కడ డిగ్రీ చదివుకున్నోళ్ళే కాదు, ఎమ్మే చదివినతను కూడా వున్నాడటండి! ఎవరో వేణట! ఈ రోజతను రాలేదట. ఉదయం మీరు చెప్పిందంతా అర్థ(మైందండి! నేనేం జేస్తే మంచిదో ఇప్పుడు చెప్పండి."

వీర్రాజులోని మార్పుకి గోపాల్ సంతోషిస్తూ – "ఆ వేణు ఎవరోకాదు రాజూ! ఈ గోపాలే ఆ వేణు గోపాల్!నీవనుకుంటున్నట్టు నేనే ఆఫీసుల్లోనూ ఆఫీసర్ని కాదు. ఆ వరండా ఆఫీసులో బంట్రోతు – టైపిస్టు – ఆఫీసర్ అన్నీ నేనే! ఉదయం తొమ్మిది దాకా ప్రయివేట్లు చెబ్తూ – పది నుంచి సాయంత్రం నాలుగు దాకా ఆ వరండా ఉద్యోగం చేస్తూ మళ్ళీ సాయంత్రం ఆరునుంచి ఎనిమిదిదాకా ప్రయివేట్లు చెబ్తూ నెలకి ఓ వెయ్యి రూపాయలు సంపాదించగల్గుతున్నాను. నా వాళ్ళని ఆదుకోగలుగుతున్నాను. ఈ మధ్య ఓ రెండు ఇంటర్వ్యూలకు వెళ్ళాను. ఓ కంపెనీలో సెలెక్టు అయినట్టు తెల్సింది. ఉద్యోగం వచ్చినా సంతోషం.లేకున్నా నా ఉద్యోగం వుండనే వుంది." అంటూ ఆగాడు గోపాల్.

వీర్రాజు విస్మయంగా గోపాల్ వేపు నోట మాట రాక చూస్తుండిపోయాడు.

"ఇప్పుడు చెప్పు రాజూ! వచ్చిన ఉద్యోగాన్ని వదిలేసి చదువుల కెగబడతావా? ఉద్యోగం చేస్తూ రాత్రి పూట చదువుకుని నీ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటావా?" సూటిగా వీర్రాజు వేపు చూస్తూ అడిగాడు గోపాల్.

"మనం చదువుకున్నాం. గవర్నమెంటే ఉద్యోగం చూపిస్తుంది – అన్న ధీమాతో కాలాన్ని వృధా చేస్తున్న ఎంతో మందికి మీలాంటివాళ్ళు తమ తమ బ్రతుకుల్ని ప్రకాశవంతం చేసుకోడానికి వెలిగించుకొనే చిరుదివ్వెలే కనువిప్పు కలిగించాలండి! మీ సలహా ప్రకారం ఉద్యోగం చేస్తూ చదువుకుంటాను సార్! ఏ చదువు భవిష్యత్తులో నాకు ఉపయోగిస్తుందో మీరే చెప్పాలి. మీ దగ్గరే వుంటి మళ్ళీ మీ శిష్యరికంలోనే డిగ్రీకూడా పూర్తిచేస్తాను. మా వూరెళ్ళి నాన్నగార్కి నా నిర్ణయం తెలియజేస్తే ఎంతో సంతోషిస్తారు. మళ్ళీ కలుస్తాను సార్!" అంటూ వీర్రాజు వెళ్ళిపోయాడు.

'లోకజ్ఞానం గల ప్రతివాళ్ళూ తనలా గైడ్ చేస్తే వీర్రాజునే కాదు యువతలో ప్రతి రాయినీ వజ్రంగా తీర్చిదిద్దొచ్చు' స్వగతంలా అనుకున్నాడు గోపాల్ వీర్రాజు వెళుతున్న వేపు చూస్తూ. □